## 'గిరిజన సలహామండలి' సభ్యులైన

# శాసనసభ్యులకు - అధికారులకు

అయ్యా, అమ్మా !

విషయం:

**(1) గిరిజనప్రాంతాలలో ఖనిజాల తవ్వకం గిరిజన సంస్థల యాజమాన్యంలోనే జరగాలి.**

**(2) సుప్రీంకోర్టు తీర్పులో (1997) నిర్వాసితులకు ఇచ్చేరాయితీలు - ఆంధ్రప్రదేశ్‌కు వర్తింపచేయాలి.**

**(3) తూర్పు కనుమలలో క్షీణిస్తున్న పర్యావరణ పరిస్థితులనుబట్టి గనుల తవ్వకం ఆలోచన విరమించుకోవాలి - గిరిజన సలహామండలిలో తీర్మానాలుచేసి - ఉత్తర్వులు జారీఅయ్యేటట్లు చేయవలసిందిగా విన్నపం.**

మన రాష్ట్రప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థద్వారా బాక్సైట్ నిల్వలను - ఇతర ఖనిజాలను తవ్వి తీయాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలలో, గిరిజనుల యాజమాన్యంలోగల సంస్థలే, అనగా గిరిజన సహకార సంస్థ, గిరిజనుల రంగు రాళ్ళ తవ్వకం కోసం ట్రైకార్‌లో ఒక సంస్థ, గిరిజన ప్రాంతాలలో జల విద్యుత్తు ఉత్పత్తికోసం "ట్రిప్‌కో", ఈ విధంగా ప్రభుత్వం ఏర్పరచిన గిరిజన సంస్థలే చేపట్టే సాంప్రదాయం ఉన్నది. 1991లో గిరిజన ప్రాంతాలలో గిరిజనులకే మైనింగ్‌లైసెన్స్‌లు ఇవ్వాలని ఐదవషెడ్యూలు కింద ఉత్తర్వులు జారీ చేశారు. కాబట్టి ప్రభుత్వ గిరిజన సంస్థలే మైనింగ్ చేపట్టవలసి ఉన్నది. దీనివల్ల గిరిజనులకు ఎక్కువ ఉపాధి లభిస్తుంది.

కాని 'సమత' తీర్పులో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధిసంస్థ వంటి ప్రభుత్వ సంస్థలు మైనింగ్ చేపట్టవచ్చునని పేర్కొనడం గిరిజన ప్రాంత పరిపాలన సాంప్రదాయాలకు, పైన పేర్కొన మైనింగ్ చట్టం సవరణకు విరుద్ధంగా ఉంది. ఈ అవకాశంవల్ల ప్రభుత్వ పర్యాటకసంస్థవంటి సంస్థలుకూడా తమ కార్యక్రమాలను గిరిజన ప్రాంతంలో విస్తరిస్తున్నవి. కాబట్టి ఐదవషెడ్యూలు కింద ఏర్పాటుచేసిన 'గిరిజన సలహామండలి'లో సభ్యులైన మీరు వెంటనే ఈ తీర్పును తగిన విధంగా సవరిస్తూ ప్రభుత్వ గిరిజన సంస్థలు మాత్రమే ఏ కార్యక్రమాన్నైనా చేపట్టేవిధంగా తీర్మానంచేసి, ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు వచ్చేటట్టు కృషిచేయవలసిందిగా కోరుతున్నాము. గతంలో పరిశ్రమ & వాణిజ్యశాఖ గిరిజన ప్రాంతంలో తమ కార్యకలాపాలనునిర్వహించుకోడానికి అనుమతిని "గిరిజన సలహా మండలి" ది. 15-9-1994న తిరస్కరించిన సందర్భాన్ని తమకు గుర్తుచేస్తున్నాము.

అంతేకాక ఇతర రాష్ట్రాలలో గిరిజనేతరులు మైనింగ్ చేపట్టిన చోట ఇదే తీర్పు ప్రకారం నిర్వాసితులైన గిరిజనులకు 20% వాటా కంపెనీల బడ్జెట్‌లో 20% గనుల తవ్విన ప్రాంత అభివృద్ధికి ఖర్చు పెట్టవలసి ఉన్నది. ఈ అవకాశాలు మన రాష్ట్రానికికూడా వర్తింపచేయాలని తీర్మానం చేయవలసిందిగా కోరుతున్నాము. ఈ మేరకు ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయాన్ని తమకు తెలియపరుస్తున్నాము. ఇందువల్ల సింగరేణి కాలరీస్ వల్ల నిర్వాసితులౌతున్న గిరిజనుల పరిస్థితి ఇంతకు ముందుకంటే మెరుగుపడుతుంది.

చెట్టు చేమా నశించి - కొండ చరియలు విరిగిపడి - ఊటకాలువలు ఇంకిపోయి, తూర్పుకనుమలలో గిరిజన ప్రాంతాలు ధ్వంసమైపోతున్నాయి. ఈ తరుణంలో ఖనిజాలకోసం తవ్వకం, గిరిజన ప్రాంతాలనే కాదు - ఈ ప్రాంతం నీటివనరుల మీద ఆధారపడిన కోస్తాను కూడా వరదలతో - పూడికతో మరింత నాశనంచేయగలదు. ఈ వాస్తవాన్ని గుర్తించి బాక్సైట్‌వంటి ఖనిజాల తవ్వకం ఆలోచనలు విరమించుకోవలసిందిగా ప్రభుత్వాన్ని ఒప్పించవలసిందిగా కోరుతున్నాము.

## బాక్సైట్‌వల్ల ఉపాధి - తూర్పుతీరానికి సమాధి

**శక్తి**, 305, మెదటి బ్లాకు, జనప్రియ అబోడ్స్, గాంధీనగర్, హైదరాబాద్-80. ☎: 040 - 55614787.